
ప్రజాశక్తి
బుధవారం 12 నవంబర్ 2025
5
పార్వతీపురం మన్యం



జనవరి 27న పోలమాంబ జాతర

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని ప్రఖ్యాతిగాంచిన పోలమాంబ అమ్మవారి జాతర తేదీలను ఖరారు చేసినట్టు విఎ బి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం స్థానిక చదురుగుడి వద్ద ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ గ్రామ పెద్దల అందరి సమక్షంలో సమావేశమై జనవరి 26, 27, 28 తేదీల్లో ప్రధాన జాతర నిర్వహించాలని నిర్ణయించారు. డిసెంబర్ 22న అమ్మవారి సనప చాటింపుతో మొదలైన పండగ వచ్చే ఏడాది మార్చి 31తో ముగియనుంది. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు టి.పోలినాయుడు ఉపసర్పంచ్ ఎ.వెంకటరమణ, ధర్మకర్తల మండలి సభ్యులు ఎస్.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో స్టోన్ క్రషర్స్

జీవనోపాధి కోల్పోయిన వందలాది కార్మిక కుటుంబాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి విజయనగరంలోని స్టోన్ క్రషర్లు సంక్షోభంలోకి వెళ్లాయి. లావాదేవీలు తగ్గిపోవడంతో ఆయా క్రషర్ యాజమాన్యాల ఆదాయం తగ్గిపోవడంతోపాటు అందులో పనిచేస్తున్న వేలాది మంది కార్మిక కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నారు. రాయిల్టీ పేరిట ప్రభుత్వం మోపిన ఆర్థిక భారం మోయలేక ఎన్నో క్రషర్స్ మూతపడ్డాయి. కొందరు అత్తెసరు వేతనాలతో బతుకీడుస్తున్నారు.

పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో గతంలో సుమారు వందకుపైగా స్టోన్ క్రషర్స్ ఉండేవి. ప్రస్తుతం 80వరకు స్టోన్ క్రషర్లు ఉన్నాయి. ఇవి కూడా సంక్షోభంలోకి వెళ్లాయి. వాస్తవానికి ఉమ్మడి విజయనగరం జిల్లాలో అత్యంత నాణ్యతగలిగిన స్టోన్ గనులు ఉన్నాయి. అందులోనూ మన రెండు జిల్లాలతోపాటు శ్రీకాకుళం, అటు ఒడిశాలోని రాయగడ జిల్లాకు కూడా రోడ్లు, భవనాలతోపాటు రైల్వే ట్రాక్ నిర్మాణాలకు అవసరమైన రాళ్లు ఇక్కడి నుంచి సరఫరా జరుగుతుంటాయి. లోడింగ్, అన్‌లోడింగ్, రాయిని వివిధ పరిమాణాల్లో సైజుచేసే ప్రక్రియలో భాగంగా పని చేసేవారు, డ్రైవర్లు, సెక్యూరిటీ వంటి రూపాల్లో సుమారు వెయ్యిమందికిపైగా ఈ క్రషర్స్‌లో జీవనోపాధి పొందుతున్నారు. గనుల నిర్వహణ గతంలో వైసిపి ప్రభుత్వమే గుత్తపెట్టుబడిదారులకు అప్పగించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లోని స్టోన్ క్రషర్‌తోపాటు మాంగనీస్, క్వార్ట్జ్ తదితర గనులన్నీ రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అనే కంపెనీ ఆధీనంలో నడుస్తున్నాయి. మైనింగ్ అధికారులు కేవలం లెక్కలు, జమాకే పరిమితం. ఇదే అదునుగా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ రాయిల్టీని ఇష్టారాజ్యంగా పెంచిందని స్టోన్ క్రషర్ల యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భవన నిర్మాణాలకు తగిన నిధులు కేటాయించకపోవడం, సాగునీటి ప్రాజెక్టులపైనా పెద్దగా శ్రద్ధ చూపకపోవడం, కనీసం ఇంటి నిర్మాణాలకు కూడా ముందుకు రాకపోవడంతో ఇసుక, సిమెంట్‌తోపాటు స్టోన్ క్రషర్ వినియోగం కూడా తగ్గిపోతోంది. గత ప్రభుత్వం చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, బల్కుమిల్కు సెంటర్లు, వెల్‌నెస్ సెంటర్ల

అమ్మకాలు లేక ఆత్యం మైనింగ్‌లో నిల్వ ఉన్న పిక్క



పనులను అర్థాంతరంగా నిలిపివేసింది. ఈ భవనాల నిర్మాణాలను ఉపాధి హామీ ద్వారా మెటీరియల్ కాంపొనెంట్ పనుల్లో ప్రాధాన్యత క్రమంగా పెట్టిన సంగతి విధితమే. కూటమి వచ్చాక వాటిని నాన్ ప్రయారిటీలో పెట్టింది. రోడ్లు, కాలువలు ప్రాధాన్యతలో ఉంచినట్టు ప్రకటించినప్పటికీ అందుకు తగ్గట్టు పనులు చేపట్టలేదు. మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో చేపట్టిన రోడ్లు, కాలువలు నిర్మాణ పనులకు ఒక్క విజయనగరం జిల్లాలోనే రూ.97.79కోట్ల మేర ప్రభుత్వ బకాయి ఉంది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. పైన పేర్కొన్న రకరకాల భవన నిర్మాణ పనులను ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లడం లేదు. గడిచిన ఏడాదిన్నరలో కొత్తగా ఇళ్లు మంజూరు చేసిన దాఖలాలు లేవు. ఉత్తరాంధ్రలో సాగునీటి ప్రాజెక్టులు, ఇతర నిర్మాణ పనులు కూడా ఏమీ చేపట్టలేదు. చివరికి ఆర్‌అండ్‌బి, జాతీయ రహదారులు అస్తవస్తంగా ఉన్నప్పటికీ వాటిని పూర్తిచేసేందుకు చొరవ చూపలేదు. మరోవైపు గడిచిన పదేళ్లలో స్టోన్ వ్యాపారంలో అత్యంత కీలకంగా ఉండే మూడవ రైల్వేలైను పనులు పూర్తికావచ్చాయి. ఫలితంగా క్రషర్ యాజమాన్యాలు తమ ఉత్పత్తిని అనివార్యంగా తగ్గించుకోవాల్సిన పరిస్థితి రావడంతో విజయనగరం జిల్లా వేపాడ మండలం వాయిలపాడులో ఐదు క్రషర్స్‌కుగాను మూడు (మహవీర, కోటేశ్వరరావు, ఆప్‌కాన్స్) మూతపడ్డాయి. అదే మండలం బొద్దాంలో ఆరింటికి మూడే నడుస్తున్నాయి. వీలుపర్తిలో రెండు క్రషర్లు దివాలా తీశాయి. పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలం చినగుడబ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆత్యం మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా ఉత్పతిని తగ్గించుకుంది. దీంతో, పది మంది కార్మికులు జీవనోపాధికి దూరం కావాల్సి వచ్చింది. ఆ చుట్టుపక్కల మరికొన్ని క్రషర్స్ మూతపడ్డాయి. జిల్లా వ్యాప్తంగా ఈ పరిస్థితి కనిపిస్తోంది. ఈనేపథ్యంలో నిర్మాణ పనులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాల్సివుంది. లేదంటే కంపెనీలతోపాటు అందులో పనిచేస్తున్న కార్మికులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఔను ఉత్పత్తి తగ్గించుకున్నాం

ఔను...! స్టోన్ క్రషర్స్ వ్యాపారం గతం మాదిరిగా లేదు. పెద్దగా కొనుగోలు ఆర్డర్లు లేకపోవడం వల్ల నిల్వలు పేరుకుపోతున్నాయి. మరోవైపు రాయిల్టీ మొదలుకొని అన్నీ మదుపులు కూడా పెరిగాయి. దీనివల్ల ఉత్పత్తి చాలా వరకు తగ్గించుకున్నాం. 90శాతం వరకూ వ్యాపారం తగ్గిపోవడంతో అందకనుగుణంగా కార్మికుల సంఖ్యను కూడా తగ్గించుకోవాల్సివచ్చింది.

నాగేశ్వరరావు, ఆత్యం మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, చినగుడబ

వినతులు స్వీకరించని ఎన్‌హెచ్‌ఆర్‌సి


మెయిల్ లో పంపాలన్న ఇన్వెస్టిగేషన్ సభ్యులు
నిరాశతో వెనుదిరిగిన గిరిజన సంఘాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని కురుపాం గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినుల మృతి, 200 మందికి పైగా బాలికలు అస్వస్థతకు గురికావడం వంటి పరిణామాలపై విచారణకు జాతీయ మానవహక్కుల కమిషన్ పరిశోధన బృందం సభ్యులు యతి ప్రకాశ్ శర్మ, సంజయ్ కుమార్ మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కురుపాం గురుకుల పాఠశాలలో జరిగిన పరిణామాలతో సంబంధం ఉన్న అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గిరిజన సంక్షేమ, గ్రామీణ నీటి పారుదల, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. పాఠశాలలో ఇద్దరు విద్యార్థినుల మరణం, ఎక్కువ మంది పచ్చకామెర్లతో బాధపడ్డానికి మూలకారణాలేమిటని అధికారులను ప్రశ్నించారు. హాజరైన అన్ని శాఖల అధికారులు లిఖిత పూర్వకంగా నివేదికలను వారికి అందజేశారు. ఈ సభ్యులు బుధవారం కురుపాం గురుకుల పాఠశాలను సందర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ డిడి విజయశాంతి, సహాయ గిరిజన సంక్షేమ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కరరావు, ఏరియా ఆసుపత్రి వైద్యాధికారులు, పిహెచ్ సి వైద్యులు పాల్గొన్నారు.

వినతులు తీసుకోని బృందం సభ్యులు

జిల్లాలో గిరిజన విద్యార్థుల మరణాలపై విచారణకు వచ్చిన జాతీయ మానవహక్కుల కమిషన్ పరిశోధన బృందం సభ్యులకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం పలు గిరిజన సంఘాల నాయకులు కలిసి వినతిపత్రాలు అందజేయడానికి ప్రయత్నించారు. జిల్లాలో ఇంతవరకు ఎంతమంది విద్యార్థులు మరణించారో, మరణాలకు కారణాలను వివరిస్తూ వారు వినతిపత్రాలు అందజేయడానికి హాజరయ్యారు. అయితే కమిషన్ పరిశోధన బృందం సభ్యులు వినతులు స్వీకరించలేదు. తమకు వినతులు స్వీకరించే అధికారం లేదని గిరిజన సంఘాల నాయకులకు చెప్పారు. దీంతో వారు తీవ్ర నిరాశకు లోనయ్యారు. వినతులను జాతీయ మానవహక్కుల కమిషన్‌కు మెయిల్ ద్వారా పంపించాలని సూచించారు. బృందం సభ్యులను కలిసిన వారిలో ఆదివాసీ జెఎసి నాయకులు కొండగొర్రి ఉదయ్ కుమార్, దుక్క సీతారాం, నెమలి పిట్ట కళ్యాణ్, నిమ్మక అన్నారావు ఉన్నారు.



ఎన్‌హెచ్‌ఆర్‌సి బృందం సభ్యులకు వినతిని అందజేసేందుకు వచ్చిన గిరిజనులు

సజావుగా ధాన్యం కొనుగోలు : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 2025-26 ఖరీఫ్ సీజనులో ధాన్యం కొనుగోళ్లలో కచ్చితత్వంతో కూడిన తేమ పరీక్షలను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో క్షేత్రస్థాయి సిబ్బంది పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. ఎఫ్ఎక్యూ పరిమితులకు అనుగుణంగా కట్టుబడి ఉండాలని, ఇందులో ఎటువంటి సందేహం వద్దని తేల్చి చెప్పారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జేసీ పౌర సరఫరాల సిబ్బంది, బ్యాంకర్లు, మిల్లర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణకు అవసరమైన రవాణా, హమాలీలు, గోనె సంచులను అందుబాటులో ఉంచుకోవాలని, ఈ సీజనులో ఎటువంటి లోటుపాట్లకు తావివ్వరాదన్నారు. రైతు సేవా కేంద్రాల్లో షెడ్యూలింగ్ ప్రకారం జరగాలని, నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నారు. 17శాతం లోపు తేమ ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏ ఒక్క రైతుకీ ఎటువంటి సమస్య లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియకు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం సేకరణ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు జాప్యం లేకుండా రైస్ మిల్లులకు తరలించాలని, రైతులు, మిల్లర్లు, రవాణా పరమైన ఇబ్బంది లేకుండా అధికారులు చూడాలన్నారు. ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీచేసిందని, కావున పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని ఆదేశించారు. పౌర సరఫరాలు, మిల్లర్లు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని జెసీ స్పష్టం చేశారు. ధాన్యం సేకరణ చేసే వాహనాలకు జిపిఎస్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే క్షేత్ర స్థాయి సిబ్బందికి జిఎల్‌టి శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఎం.బాలసరస్వతి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కె.శ్రీనివాస్, పౌర సరఫరాల సిబ్బంది, మిల్లర్లు, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - సీతానగరం/మక్కువ

ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి వైద్య, వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. సీతానగరంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, మక్కువ మండలం భైరి వెంకటాపురంలోని పొలం పిలుస్తోంది కార్యక్రమాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఒపి, ఫార్మశీలను తనిఖీ చేసి రిజిస్టర్లను పరిశీలించారు. రోగుల వివరాలను యాప్ నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మలేరియా సిబ్బంది, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలతో మాట్లాడి పలు మార్గదర్శకాలను జారీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరుపై ఆరా తీసిన కలెక్టర్ గర్భిణులు, చిన్నపిల్లల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. వారికి అవసరమైన అన్ని టీకాలు, పోషకాహారం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పిహెచ్‌సి పరిసరాలను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

అనంతరం మక్కువ మండలం వెంకట భైరిపురంలో జరుగుతున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులంతా రసాయన ఎరువుల వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పంట దిగుబడులు, విత్తనాలు, ఎరువుల లభ్యతపై అధికారులను వివరాలు అడిగారు. వ్యవసాయ అధికారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పొలం పిలుస్తోంది ద్వారా రైతుల అవసరాలు తీరాలని కలెక్టర్ అధికారులకు హితవు పలికారు. తక్కువ సమయంలో అధిక లాభాలు వచ్చే కాయగూరల పెంపకంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి వారం పంట దిగుబడి వచ్చే వాటిపై సూచనలు చేయాలని ఉద్యానవన శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పర్యటనలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు కె.రాబర్ట్ పాల్, కె.సత్య నారాయణ రెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



యాప్ నమోదు తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

సహజ సౌందర్యానికి నిలయం అడపరాయి జలపాతం

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరు

సహజ సౌందర్యానికి నిలయం దళాయివలసలోని ఆడపరాయి జలపాతం అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. సాలూరు ఆర్థికాభివృద్ధిలో పర్యాటకరంగం కీలకపాత్ర పోషించనుందని తెలిపారు. మండలంలోని కురుకూటి పంచాయతీ పరిధిలో గల దళాయివలసలోని ఆడపరాయి వాటర్‌ఫాల్స్‌ను మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డితో కలిసి ఘనంగా ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న ఆమెకు, కలెక్టరుకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ ఈ ప్రాంతం ప్రకృతి అందాలతో నిండిన అపూర్వ పర్యాటక కేంద్రంగా అభివద్ధి చెందే సామర్థ్యం ఉందని అన్నారు. పర్యాటక రంగం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా సాలూరు పరిసర ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి దళాయివలస వాటర్‌ఫాల్స్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. పర్యాటక శాఖతో సమన్వయంగా ఈ ప్రాంతంలో ప్రాథమిక సౌకర్యాలను మరింత మెరుగుపర్చాలని, రోడ్లు, పార్కింగ్ సౌకర్యం, విశ్రాంతి కేంద్రాలు, భద్రతా చర్యలు వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. అనంతరం కలెక్టర్ తో కలిసి జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ జలపాతాల ఖిల్లా మన్యం జిల్లా అని, ప్రకృతి సోయగాలతో వికసిస్తుందని అన్నారు. జిల్లాలో గల అన్ని జలపాతాలను గుర్తించి పర్యాటకంగా ఈ ప్రాంతానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అలాగే పర్యాటకుల కోసం మౌలిక వసతులు, రవాణా వంటి సదుపాయాలను కూడా కల్పిస్తున్నట్లు చెప్పారు. సీజన్ స్పార్ట్స్ పేరుతో ఒక్కొక్క పర్యాటక ప్రాంతాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు చేశామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అడపరాయి జలపాతాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ ప్రభాకరరెడ్డి

ఐటిడిఎలో మాక్ పార్లమెంట్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎలో గిరిజన విద్యార్థులచే గిరిజన సంక్షేమ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాక్ పార్లమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తొలుత పాఠశాల స్థాయిలో ఎ, బి, సి, డి అను పార్టీలు ఏర్పాటు చేసి మాక్ ఎన్నిక, ఓట్ల లెక్కింపు గెలిచిన అభ్యర్థుల ప్రకటన జరిగింది. అనంతరం క్లస్టర్ స్థాయిలో దీన్ని నిర్వహించి వివిధ పాఠశాలల నుంచి ఎంపికైన విద్యార్థులు ఐటిడిఎ స్థాయిలో నిర్వహించిన మాక్ పార్లమెంట్ కు హాజరు అయ్యారు. తొలుత మాక్ పార్లమెంట్‌కు ఎంపికైన సభ్యుల (విద్యార్థులు)చే ప్రమాస్వీకారం చేయించారు. తదుపరి స్పీకర్ ఎన్నిక నిర్వహించారు. మెజారిటీ పార్టీ ప్రధాన మంత్రి, మంత్రి మండలిని ఎన్నుకోవడం జరిగింది. వారిచేత రాష్ట్రపతి ప్రమాణ స్వీకారం చేయించారు. తదుపరి రాష్ట్రపతి ప్రసంగం చేశారు. మాక్ పార్లమెంట్ నిర్వహణ సందర్భంగా ప్రధాన మంత్రి సభలో ప్రసంగించారు. అన్నిశాఖలపై చర్చ జరిగింది. ఆయా శాఖలకు మంత్రులుగా వ్యవహరించిన విద్యార్థులు చాలా చక్కగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. మాక్ పార్లమెంట్‌లో వాస్తవ పార్లమెంట్ ను ప్రతిబింబిస్తూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అన్ని పదవులను విద్యార్థులు నిర్వహించి వారి ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థుల్లో ఉత్తమ మంత్రిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, ఉత్తమ ప్రతిపక్ష నేతగా వ్యవహరించిన విద్యార్థులకు అవార్డులు ఇవ్వడం జరుగుతుంది. అనంతరం విద్యార్థులు ఎమ్మెల్యే, పిఒ అభినందించారు. కార్యక్రమంలో డిడి ఎం.అన్నాదొర, డిప్యూటీ డిఇఒ జి.రామ్మోహన రావు, మెళియాపుట్టి ఎటిడబ్ల్యుఒ పి.సూర్యనారా యణ, బడ్డుమాసంగి హెచ్‌ఎం పి.కోటిబాబు, సీతంపేట బాలికల పాఠశాల హెచ్‌ఎం టి.వసంత లక్ష్మి, పిఎంఆర్‌సి జిసిడిఒ రాములమ్మ, గురుకుల కళాశాలలు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాక్ పార్లమెంటులో పాల్గొన్న విద్యార్థులు

శాఖల సమన్వయంతోనే పార్కింగ్ స్థలం ఏర్పాటు

ప్రజాశక్తి- పార్వతీపురంటౌన్

అన్ని శాఖల సమన్వయంతోనే పట్టణంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయడం జరుగుతుందని టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ వెంకటనారాయణ అన్నారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన పిజిఆర్ఎస్‌లో వినియోగదారుల సంఘ సభ్యులు మాన్యం రామకృష్ణ, తదితరులు జిల్లా, పట్టణ కేంద్రాల్లో ఉన్న ప్రజలతో, పాటు పలు గ్రామాల నుండి వచ్చిన ప్రజల వాహనాలకు పార్కింగ్ సౌకర్యం లేదని, అత్యవసర పరిస్థితుల్లో పార్కింగ్ చేస్తే ట్రాఫిక్ పోలీసులు ఫోటోలు తీసి చలనాలు వేస్తున్నారని ఇచ్చిన వినతిని ఇచ్చారు. ఈ మేరకు కలెక్టరేట్ కార్యాలయం నుంచి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగానికి పంపడంతో ఫిర్యాదు దారులు మంగళవారం స్థానికమున్సిపల్ కార్యాలయానికి వచ్చి టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ వెంకట నారాయణను కలిశారు. పోలీసులు శాఖ, ప్రజలు, మున్సిపల్ అధికారుల సమన్వయం తోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని, ఈ విషయంపై ఈ ఫిర్యాదును ఉన్నతాధికారులకు తెలియజేస్తానని తెలిపారు. మాన్యం రామకృష్ణతో పాటు సంఘ కార్యవర్గ సభ్యులు పెంటపాటి సూర్యారావు పాల్గొన్నారు.

భావితరాలకు ఆజాద్ స్ఫూర్తిని అందించాలి : జెసి

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

ప్రజాశక్తి - పార్వతీపురం

మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయ సాధన దిశగా అంతా నడుచుకోవాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆజాద్ జయంతి వేడుకలు మంగళవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జెసి ముఖ్యఅతిథిగా పాల్గొని, ఆజాద్ చిత్రపటానికి పూలమాలలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖ మంత్రిగా పనిచేశారన్నారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడే ఐఐటి, వైద్య అకాడమీ ఏర్పాటు వంటి నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఆజాద్ కులమతాలకు అతీతంగా మూఢనమ్మకాలకు తావులేకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా కృషి చేశారని కొనియాడారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికీ మూఢ నమ్మకాలు ఉన్నాయని, వాటిని విడనాడాలని జేసీ కోరారు.ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, వారి ఆశయసాధనకు కృషిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి షరీఫ్, జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సయ్యద్ ఇబ్రహీం హుస్సేన్, ఉపాధ్యక్షులు షరీఫ్ రజాక్, సాలూరు జామియా మసీద్ ప్రెసిడెంట్ షేక్ భాషా, మసీదుల ఇమామ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్ : మౌలానా అబుల్ కలాం 137 వ జయంతిని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి హాజరై, ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప విద్యావేత్త అని, స్వాతంత్ర్యం అనంతరం దేశ తొలి విద్యాశాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించి విద్యా రంగ అభివృద్ధికి, విద్యా సంస్థల స్థాపనలో నూతన మార్గాలను సృష్టించారన్నారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ రమణమూర్తి, ఆర్ఐ నాయుడు, ఎఎఒ సతీష్ బాబు, ఆర్ఎస్‌ఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, పోలీసు కార్యాలయం, డిసిఆర్‌బి, ఎస్‌బి, ఎఆర్, ఐ టి కోర్ సిబ్బంది పాల్గొనిన్నారు. తొలుత ఆజాద్ చిత్రపటానికి పుష్పాలు సమర్పించి, నివాళులు అర్పించారు.



ఆజాద్‌కు నివాళ్లు అర్పిస్తున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ముస్లిం పెద్దలు

బలిజిపేట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంచార్జ్ హెచ్‌ఎం బి.వెంకటరమణ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఇఒ-1 ఎస్.సింహాచలంఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నారాయణస్వామి, బొత్స గణేష్, సింహాద్రి, పీడీలు శివకుమార్, శ్రీదేవి, జ్యోతి, సిఆర్పీ సాంబశివరావు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాల ఎకడమిక్ కో ఆర్డినేటర్ జి.తులసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆజాద్ జన్మదినం సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీవరం మాట్లాడారు. . కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామయ్య, ఐక్యు ఎసి కోఆర్డినేటర్ స్వరూప శ్రీవాణి, సత్యా, విద్యార్థులు పాల్గొన్నారు.

అందెశ్రీకి విద్యార్థుల నివాళి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

సహజ కవి డా అందెశ్రీ చిత్రపటానికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ కవి అందెశ్రీ మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. అక్షర జ్ఞానం లేకపోయినా సాహిత్య జ్ఞానాన్ని ఒంటబట్టించుకొని చిరస్మరణీయుడయ్యారని కొనియాడారు. తెలుగు అధ్యాపకులు రామయ్య మాట్లాడుతూ అక్షరాన్ని ఒడిసిపట్టి తెలంగాణ జానపదాన్ని జీర్ణింపజేసికొని బాణీలు కట్టి సాహిత్యభిమానుల గుండెల్లో నిలిచిపోయారన్నారు. అందెశ్రీ రాసిన 'మాయమైపోడమ్మా మనిషన్న వాడు ' గీతాన్ని పాడి వారి ఆత్మను గుర్తు చేసికొన్నారు.

పారదర్శకంగా ఇ - పంట నమోదు కావాలి : జెసి

ప్రజాశక్తి - సీతానగరం

జిల్లాలో ఇ - పంట నమోదు పారదర్శకంగా జరగాలని జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి తెలిపారు. రైతు సంక్షేమ పథకాల సులభతరానికి నిజమైన రైతు డేటా అవసరమని పేర్కొన్నారు. మండలంలోని కాసాపేటలో జరుగుతున్న ఇ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం జెసి సూపర్ చెక్ చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడుతూ ఇ-క్రాప్ విధానంలో నమోదు చేయబడిన పంట వివరాల ఖచ్చితత్వాన్ని ధృవీకరించారు. కంకులతో ఉన్న వరి పొలాలను పరిశీలించి పంట పెరుగుదల దశను తనిఖీ చేసి నీటిపారుదల కాలువలు, పొలంలో తేమ పరిస్థితులను గమనించి రైతులకు పలు సూచనలు చేశారు. రిజిస్టర్ల మేరకు క్షేత్రస్థాయిలో పత్రాలను సమీక్షించి, భౌతిక పంట విస్తీర్ణాన్ని ఇ-క్రాప్ దరఖాస్తులో అప్‌లోడ్ చేసిన ఎంట్రీలతో పోల్చి చూశారు. సాగు వివరాలు సరిగ్గా నవీకరించడానికి ఇటీవల పండించిన ప్రాంతాలను తనిఖీ చేశారు. ఇ-క్రాప్ రికార్డింగ్‌లో 100శాతం ఖచ్చితత్వాన్ని కొనసాగించాలని, సకాలంలో నవీకరణలను నిర్ధారించాలని, ధ్రువీకరణ సమయంలో గుర్తించిన ఏవైనా వ్యత్యాసాలను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. పంట రికార్డింగ్‌లో పారదర్శకతను నిర్ధారించడానికి, రైతు సంక్షేమ పథకాలను సులభతరం చేయడానికి నిజమైన రైతు డేటాను పొందాలని ఆయన తేల్చిచెప్పారు. ఈ తనిఖీ సమయంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జెసి యశ్వంత్‌కుమార్‌రెడ్డి

104 జిల్లా మేనేజర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - బలిజిపేట

104 వాహనం వైద్య సేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ అన్నారు. మండలంలోని నారాయణపురంలో మంగళవారం జరుగుతున్న 104 వైద్య శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ ప్రజలకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. పలు వివరాలను అడిగి వాహనంలో అన్ని రికార్డులు, మందుల లభ్యతను పరిశీలించారు. వాహనాన్ని తనిఖీ చేసి, పరిస్థితిని పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇంకా మెరుగైన వైద్య సేవలందించాలని ప్రజలకు ఎటువంటి మందుల కొరత లేకుండా చూసుకోవాలని, ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకుని రావాలని అన్నారు. సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్య, 104 సిబ్బంది పాల్గొన్నారు.


సీతంపేటలో కారును సోదా చేస్తున్న పోలీసులు

ఏజెన్సీలో ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - సీతంపేట

దేశ రాజధానిలో ఢిల్లీలో బాంబు పేలుడు ఘటనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. దీంతో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. దీనిలో భాగంగా స్థానిక ఎస్పై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక అడ్వెంచర్ పార్కు వద్ద ప్రతి కారును క్షుణంగా తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాలు సైతం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ట్రైనీ ఎస్పైలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట గ్రామాల్లో గల జంక్షన్ల వద్ద ఎల్విన్‌పేట పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ట్రైనింగ్ ఎస్ఐ రవీంద్ర, ఎఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ పరిసరాలు, బస్సుల్లో క్షుణ్ణంగా పరిశీలించారు. ఆంధ్రా - ఒడిశా ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని ఆపి పరిశీలించారు. అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించారు.

గర్భిణుల ఆరోగ్యం పట్ల దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గర్భిణులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానిక వైద్యాధికారులు బి.ప్రదీప్ కుమార్, ఎం.సాయికుమార్ ఆశా కార్యకర్తలు ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించి అందులో భాగంగా గర్భిణులను గుర్తించి వారికి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు పడేలా చూడాలన్నారు. అలాగే హైరిస్క్ కేసులు కూడా గుర్తించి వారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గర్భిణులకు అత్యవసర పరిస్థితుల్లో 108 వాహన సహాయం ద్వారా అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యం కోసం తరలించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శాంతి కుమారి, ఆదిలక్ష్మి, సుభారతామని, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుంటే చర్యలు


ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రమైన కురుపాంలో మంగళవారం స్థానిక ఎస్ఐపి. నారాయణరావు వాహనాలపై ముమ్మర తనిఖీలు చేపట్టి లైసెన్స్, ఇన్సూరెన్స్, తదితర ధ్రువీకరణ పత్రాల్లేని వాహనదారులపై అపరాధ రుసుము విధించారు. అనంతరం వాహనదారులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించి, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా నేడు గృహప్రవేశాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లుంబేసు పంచాయతీ లప్పటి గ్రామంలో బుధవారం గృహప్రవేశాలు కార్యక్రమం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభిస్తారని ఎఇ రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. అధికారులు, కూటమి నాయకులు, గ్రామస్తులు హాజరు కావాలని కోరారు.


శివకుమార్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కళింగ వైశ్య బోర్డు డైరెక్టర్‌ను అభినందించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర కళింగ కోమటి, కలింగ వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ బోర్డ్ డైరెక్టర్‌గా నియమించబడిన వారణాసి శివకుమార్‌ను ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సన్మానించి, అభినందించారు. పార్టీ అభివృద్ధికి క్షేత్రస్థాయిలో కష్టించి పనిచేసే వారికి గుర్తింపుతో పాటు మంచి పదవులు దక్కుతాయని ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల కాలంలో నియోజకవర్గంలో పలువురు పొందిన పదవులే ఇందుకు నిదర్శనమని, పదవులు పొందిన ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కద్రక మల్లేశ్వరరావు, ఎఎంసి వైస్ చైర్మన్ గార గౌరీశంకర్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎఎంసి చైర్మన్ కోలా రంజిత్ కుమార్, జియ్యమ్మవలస టిడిపి మండల కన్వీనర్ జోగి భుజంగరావు, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతి, నాయకులు కోట సుమన్, రాగాల అప్పలకొండ, బొత్స ప్రకాష్ రావు, శ్రీరామ్, యకోబు, సింహాచలం తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల మహిళా సమైక్య కార్యాలయంలో మంగళవారం ఎస్పై జి.కళాధర్ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు, మహిళపై అత్యాచారాలు, పోక్స్ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమైక్య అధ్యక్షులు కె.లలిత కుమారి, ఎపిఎం కె.రాము, మహిళా సమైక్య కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టపూడివలస గ్రామ జంక్షన్ వద్ద గల శ్రీ సత్యసాయి అన్నపూర్ణ సేవా సమితిలో ఈనెల 12న విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలికంగా కంటి సమస్యతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, శిబిరానికి వచ్చేవారు ఆధారు, రేషన్ గుర్తింపు కార్డుతో పాటు మొబైల్, రెండు జతల బట్టలు, ప్లేటు, గ్లాసు తమ వెంట తీసుకురావాలని నిర్వాహకులు కోరారు.

సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని కేదారిపురంలో గల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపిడిఒ ఐవి లక్ష్మి మంగళవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈ సందర్భంగా చెత్త నుంచి సంపద తయారీ, వర్మీ కంపోస్ట్ విధానాన్ని ఆమె పరిశీలించారు. గ్రామ పంచాయతీలో ప్రతిరోజు ఉదయం ప్రతి ఇంటి నుంచి సేకరిస్తున్న తడి, పొడి చెత్త గురించి హరిత రాయబారులకు, ఇటీవల గ్రామస్థాయిలో నియమించబడ్డ సిఆర్‌పిలకు తగు సూచనలు ఇచ్చారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు చెత్తను సేకరించి ప్రజలను ఆరోగ్యవంతులుగా ఉంచడంలో హరిత రాయబార్ల బాధ్యతతో అభినందనీయం అన్నారు. ఎస్‌డబ్ల్యుపిఎస్ షెడ్ ద్వారా గ్రామ పంచాయతీకి వస్తున్న ఆదాయాన్ని, హరిత రాయబార్లకు చెల్లిస్తున్న జీతాలు, వర్మీ కంపోస్ట్ ఎరువులు రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బిడ్డిక సురేష్, సిబ్బంది ఉన్నారు.


చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఐవి లక్ష్మి

అపరిశుభ్రతపై కలెక్టర్ ఫైర్

డస్ట్ బిన్ లేని దుకాణాల లైసెన్స్ రద్దు
9 మంది సచివాలయ సిబ్బందికి మెమోలు

ప్రజాశక్తి- మక్కువ

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.ప్రభాకరరెడ్డి మక్కువ ప్రధానరహదారిపై మంగళవారం రాత్రి కాలినడకన తిరుగుతూ అపరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. సాలూరు నుంచి తిరుగు ప్రయాణంలో ప్రధాన రహదారిలో ఉన్న వ్యాపార సముదాయాలను పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పట్ల ఆయన అసహనం వ్యక్తం చేస్తూ ప్రస్తుతం గ్రీన్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తున్న వారిని తమ విధుల నుంచి తొలగించమని స్థానిక ఇఒ బెహరా శ్రీనివాస్‌కు ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో పనిచేస్తున్న 9 మంది సిబ్బందికి మెమోలు జారీ చేయమని ఎంపిడిఒ అర్జునరావును ఆదేశించారు. గ్రామంలో అపారిశుధ్యానికి తోవ లేకుండా చూడాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిలో మార్కెట్ లో రహదారిపై ఉన్న దుకాణాలను వెంటనే తొలగించాలని, తొలగించని వారిపై చర్యలు తీసుకోమని స్థానిక ఎస్పైనకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పై మాట్లాడుతూ రోడ్డుపై దుకాణాలు నిర్వహిస్తున్న వారికి ఇదివరకే నోటీసులు అందజేశామని తెలిపారు. వారు ఖాళీ చేయని యెడల దుకాణదారులను తాము ఖాళీ చేపిస్తామని అన్నారు. ఎవరి దుకాణాల వద్ద వారు డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, లేనిపక్షంలో ఆ దుకాణాలను సీజ్ చేయమని కలెక్టర్ సిబ్బందిని ఆదేశించారు.


దుకాణ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి


ఆక్రమణకు గురైన రాయిమెట్ట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

కలెక్టర్, తహశీల్దార్
ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించరా? : సిపిఎం

ప్రజాశక్తి - బలిజిపేట

మండల కేంద్ర మైన బలిజి పేట లోని రాయి మెట్టకు వేసిన కంచెను జిల్లా కలెక్టర్, తహశీల్దార్ తొలగిం చలేరా అని? ప్రభు త్వ భూము లకు రక్షణ కల్పించలేరా సిపిఎం నాయకులు రెడ్డి వేణు వేణు ప్రశ్నించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరానున్న మెట్ట కాలనీలో ఆక్రమించిన ప్రభుత్వ మెట్ట చుట్టూ వేసిన కంచెను, ఇళ్ల స్థలాలను సిపిఎం నాయకులు రెడ్డి వేణు, బొద్దాన భానుమూర్తి, నల్ల ఈశ్వరరావు, వై.మన్మధరావు పరిశీలించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ పలగార రెవెన్యూ బలిజిపేటలోని మెట్ట కాలనీలో సర్వే నంబర్ 32 /2లో కొంతమంది ప్రభుత్వ భూమి రాయి మెట్ట చుట్టూ కంచె వేశారన్నారు. గతంలో ఈ మెట్టపై మంచినీళ్ల ట్యాంకు కట్టాలని అప్పటి రెవెన్యూ అధికారులు, ప్రభుత్వం పెద్దలు నిర్ణయించారన్నారు. అయితే ప్రస్తుతం ఆ మెట్ట కాలనీలో ఆక్రమణలు జరుగుతూ ఒక్కొక్కరు ఇళ్లు కట్టుకోగా, మరికొంతమంది ప్రభుత్వ భూమికి చుట్టూ కంచెలు, ప్రహరీ గోడలు కడుతున్నారన్నారు. ప్రజా అవసరాల కోసం ఉపయోగించాల్సిన ప్రభుత్వ మెట్ట భూమిని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ఆక్రమిస్తే తహశీల్దార్ నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదన్నారు. జిల్లా కలెక్టర్, తహశీల్దార్ ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలని, కంచెను తొలగించాలని స్వార్థపరులు ఆక్రమించిన వారికి అండగా ఉండడం మంచిది కాదని అన్నారు. ఆక్రమణ తొలగించండి ప్రభుత్వ భూములను రక్షించండి అని అడుగుతున్న వారిపై దౌర్జన్యాలకు, బెదిరింపులకు దిగడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించకపోతే రెవెన్యూ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ నిర్మూలనపై సచివాలయ కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలన, స్వచ్ఛ సర్వేక్షన్ వంటి అంశాలపై శిక్షణా తరగతులను సచివాలయ కార్యదర్శులకు మంగళవారం నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ నుంచి శిక్షకులుగా ఎల్.వెంకటేశ్వరరావు, సుధీర్‌బాబు, మన్యం జిల్లా కోఆర్డినేటర్ గణపతమ్మ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ రత్నరాజు మాట్లాడుతూ నగర పంచాయతీ కార్యాలయాన్ని ప్లాస్టిక్ రహిత కార్యాలయంగా తీర్చిదిద్దుతామని, సిబ్బంది ఎవరూ ప్లాస్టిక్‌తో రాకుండా చూడాలని అన్నారు. నగర పంచాయతీ పరిధిలో ప్లాస్టిక్ ఉత్పత్తి వినియోగం, అమ్మకం జరిగినట్టయితే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. సిబ్బంది అందరికీ స్టీల్ వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేసి ఇకపై ఈ బాటిల్‌తోనే నీరుతాగాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న పాలకొండ, రాజాం నగర పంచాయతీ సెక్రటరీలు తమ సామర్థ్యాలను ఎల్లవేళలా మెరుగుపర్చుకోవాలన్నారు. బెస్ట్ ప్రాక్టీస్ నేర్చుకుంటూ తన వృత్తిలో తమదైన ముద్రను వేసుకోవాలని, అందుకు ఇలాంటి శిక్షణా తరగతులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అలాగే వివిధ అంశాలపై చర్చా కార్యక్రమం, ప్రదర్శన నమూనాలో అత్యంత ఆసక్తిదాయకంగా శిక్షణా తరగతులు నిర్వహించారు.

వ్యాధులను గుర్తించేందుకే సర్వేలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్


వ్యాధులు గుర్తించే లక్ష్యంగా ఆరోగ్య సర్వేలు నిర్వహించాలని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు స్పష్టం చేశారు. మండలంలోని పెదబొండపల్లి పిహెచ్‌సిని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి ఆశా డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆరోగ్య కార్యక్రమాలు ద్వారా వైద్య సేవలు అందుతున్న తీరుపై సమీక్షించారు. వ్యాధి లక్షణాలు గుర్తించడమే లక్ష్యంగా ఆరోగ్య సర్వే చేపట్టాలని ప్రస్తుతం కొనసాగుతున్న అసంక్రమిత వ్యాధుల సర్వే, స్కూల్ హెల్త్, అంగన్వాడీ స్క్రీనింగ్‌లపై ఆరా తీసి నివేదికలు పరిశీలించారు. సర్వే సమగ్రంగా నిర్వహించి 18 ఏళ్లుపై బడిన వారిలో బిపి, షుగరు, కేన్సర్, దీర్ఘకాలిక వ్యాధి లక్షణాలు, 18 ఏళ్ల లోపు 4డిలుంటే ఎదుగుదల లోపాలు, ఆలస్యాలు, వైకల్య సమస్యలు, వ్యాధులను గుర్తించి నిర్దేశించిన మాధ్యమాల ద్వారా తగు చికిత్స అందించాలని సూచించారు. గ్రామీణ స్థాయిలో ఆరోగ్య సమస్యలు సత్వరమే తెలియజేయడంలో ఆశాలు కీలకంగా వ్యవహరించాలన్నారు. అనంతరం పిహెచ్సీలో రికార్డులు తనిఖీ చేశారు. కిశోర బాలల ఆరోగ్యానికి చెందిన ఏ.ఎఫ్.హెచ్.సి క్లినిక్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జి.ధరణి, సూపర్వైజర్లు టి.వెంకటనాయుడు, జయలక్ష్మి, శంకర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఎండిఎం ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి

నిర్వాహకులకు కనీస వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - పాలకొండ

మధ్యాహ్నం భోజన పథకాన్ని ప్రైవేటీకరించే ఆలోచన విరమించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న వంట విధానాన్ని రద్దుచేసి మండలానికి ఒక చోట స్మార్ట్ కిచెన్ పేరుతో సామూహిక వంటశాల నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రయత్నం చేస్తున్నారని, ఈ ప్రయత్నాలను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని వేలాదిమంది మంది విద్యార్థులకు ఒకే చోట వంటవండి వాహనాల ద్వారా పంపిణీ చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. గ్రామీణ ప్రాంతంలో ఈ విధానం అమలు చేస్తే పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పూర్తిగా అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలను ఉద్ధరిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఇలా వారికి ద్రోహం చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఐక్యం చేసి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంఇఒకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.హిమప్రభ, సిఐటియు మండల కార్యదర్శి కాద రాము, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం మండల నాయకులు ఎ.పద్మావతి, సుంకరి గౌరీశ్వరి, దుప్పాడ అలివేలు, పి.జయలక్ష్మి, ఆర్.గౌరమ్మ, ఎం.సావిత్రమ్మ, వి.పార్వతి, వి.వరాలమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఎంఇఒకు వినతిని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి

మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రభుత్వ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటుపరం చేయడాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం స్థానిక వైఎస్‌ఆర్ విగ్రహం కూడలి వద్ద ఓపెన్ స్టాల్ ద్వారా కోటి సంతకాల సేకరణ చేపట్టారు. పెద్ద సంఖ్యలో ప్రజల మద్దతు కోరుతూ వారి నుంచి సంతకాలు సేకరించి ప్రజల నిర్ణయాన్ని రాష్ట్ర గవర్నర్‌కు తెలియచేసి ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా చేయమని కోరుతూ సాగే ఈ కార్యక్రమంలో వందలాది మంది పట్టణ ప్రజలు పాల్గొని తమ పూర్తి మద్దతును తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోనుగౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండుపూరు గుణ్ణేశ్వరరావు, పట్టణ వైసిపి అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, బిసి సెల్ అధ్యక్షులు గొర్లి మాధవరావు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సర్వోశెట్టి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి బి.రవికుమార్, పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేసే ఆలోచన కూటమి ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేస్తూ గుమ్మలక్ష్మీపురంలో అంబేద్కర్ విగ్రహం వద్ద వైసిపి నాయకులు కరపత్రాలతో నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి కె.దీనమయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటుపరం చేస్తే గిరిజన విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా ఉంటుందన్నారు. ఈ విధానాన్ని వైసిపి పూర్తిగా వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు ఆధ్వర్యంలో బుధవారం కురుపాంలో జరగబోయే మహా ధర్నాలో అంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట సర్పంచులు బొత్తాడ గౌరీ శంకర్రావు, ఆర్.చైతన్య స్రవంతి, వైసిపి నాయకులు నిమ్మక గోపాల్, జి.గిరిబాబు, వహీద్ ఖాన్, తదితరులు ఉన్నారు.


ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అప్పయ్యపేటలో గల జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు కోరారు. మంగళవారం సిపిఎం బృందం ఈ కాలనీలో పర్యటించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు, మంచి నీరు మౌలిక సదుపాయాల్లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న లేఅవుట్ కాలనీ సందర్శించగా సుమారు 40మంది ఇళ్లు నిర్మించారని, మరికొందరు ఇళ్లలో జీవనం సాగిస్తున్నారని అన్నారు. వీరు వెళ్లడానికి రోడ్డు, తాగేందుకు మంచినీరు కూడా లేదన్నారు. పక్కనే ఇంటింటా కుళాయి గ్రామంలో ఉన్నా నీరు రావడం లేదన్నారు. బోరు ఉన్నా రెండేళ్లుగా అది పనిచేయడం లేదని, రోడ్డు సమస్యను ఎంపిడిఒ, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం శూన్యమన్నారు. ఇళ్లు నిర్మించి పూర్తయి వారికి రెండేళ్లయినా మరుగుదొడ్ల బిల్లు రాలేదని, అధికారులు వెంటనే ఆ బిల్లులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు రాయిపల్లి రాము, కాలనీ కె.లక్షణ, పి.పుష్పమ్మ, కాలనీ వాసులు పాల్గొన్నారు.


సిపిఎం బృందానికి సమస్యలు విన్నవిస్తున్న కాలనీ వాసులు



పెచ్చులూడి శిథిలావస్థలో ఉన్న బిసి బాలికల హాస్టల్

కూలేందుకు సిద్ధంగా బిసి బాలికల హాస్టల్

ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు ◆ పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

స్థానిక చర్చి వీధిలో ఎస్ఎన్‌పి కాలనీలో గల బిసి సంక్షేమ బాలికల వసతి గృహం శిథిలావస్థకు చేరుకుతుంది. మంగళవారం సాయంత్రం ఆ వసతి గృహం పక్కనే ఉన్న భవనం ముందు భాగం కూలి భవన శిథిలాలు కింద పడ్డాయి. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆ భవనానికి ఆనుకొని వసతి గృహం స్లాబ్ ఎక్కడికక్కడ పెచ్చులూడి ఉండడంతో ఏ క్షణంలోనైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ఆ ప్రాంతంలో ఉన్న స్థానికులతో పాటు, విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సొంత భవనం లేక గత కొన్నేళ్లుగా బాలికల వసతి గృహాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. భవనం పాతది కావడంతో పెచ్చులూడుతుంది. ఈ వసతి గృహంలో 32 మంది విద్యార్థులు ఉన్నారు. ఏ క్షణంలో భవనం కూలుతుందోనని, భయం భయంగా ఉంటున్నారు. పక్కనే ఉన్న భవనం ముందుభాగం కూలడంతో మరింత ఆందోళన వ్యక్తమవుతుంది. ఈ విషయాన్ని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అప్పన్న వద్ద ప్రస్తావించగా భవనాన్ని సందర్శించామని, వేరేచోట అద్దె భవనం చూస్తున్నామని ఒకటి రెండు రోజుల్లో విద్యార్థులను అక్కడికి తరలిస్తామని ఆయన సమాధానం చెప్పారు.

విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యం

శృంగవరపు కోట : మండలంలోని తాటిపూడి వద్ద గల ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల ఉపాధ్యాయిని ప్రతిభ భారతి విద్యార్థినిల భద్రత పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని పర్యావరణ పరిరక్షణ వేత్త న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ ఆరోపించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం రాత్రి రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించినప్పుడు బాలికల రక్షణకు ఉండవలసిన మహిళా వాచ్‌మేన్ జాడ కనబడలేదన్నారు. మంగళవారం ఉదయం సందర్శనలో తూర్పు దిక్కున ఉన్న మూడవ ప్రహరీ గేటు కూడా తాళం వేయకుండా తెరిచి ఉందన్నారు. పాఠశాలలో చెట్లను ఇష్టానుసారంగా నరికివేయించి అమ్మేస్తున్నారని ఆరోపించారు. అటవీశాఖ బీటు శ్రీనివాసరావు తన సహాయకునితో వచ్చి కొలతలు తీసుకొని, నీలగిరి 31, చింత 14, వేప 1, అశోక 6, తురాయి 2 దుంగలను పాఠశాల ప్రాంగణంలో గుర్తించారన్నారు. చెట్లు నరికివేత పై అధికారులు తక్షణం స్పందించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైద్యారోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు, సిహెచ్‌డబ్ల్యులకు కనీస వేతనం రూ. 26వేలు ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని తాడికొండ పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా వర్కర్లుగా గుర్తించాలని, కార్మికులకు నష్టపరిచే లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, పనిభారం తగ్గించాలని, క్యాజువల్ లీవ్, మెడికల్ లీవ్ ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎం.సన్యాసిరావు, యూనియన్ నాయకులు దమయంతి, ఎన్.భారతి ఉన్నారు.

పాచిపెంట : సిహెచ్‌డబ్ల్యు, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని, అలాగే కనీస వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గంట జ్యోతిలక్ష్మి అన్నారు. స్థానిక పిహెచ్‌సి వద్ద ఆశా, సిహెచ్‌డబ్ల్యులనుద్దేశించి ఆమె మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, రాజకీయ వేధింపులు మానుకోవాలని అన్నారు. అనంతరం పాచిపెంట పిహెచ్‌సి వైద్యాధికారి శివకుమార్‌కు వినతిని అందజేశారు. శివ కుమార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, మౌలిక సమస్యలపై దృష్టి పెడతామని అన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కె.పార్వతీదేవి, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ టిడిపిపైనే పలువురు ఆశలు

శివానంద్ కలిసొచ్చేనా?


శివానంద్

పాలకొండ : పట్టణ టిడిపి అధ్యక్షులు పదవి కోసం పలువురు పోటీ పడుతున్నారు ప్రస్తుతం పట్టణ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్ మూడుసార్లు పదవి చేపట్టడంతో ఈసారి ఆయన మారొచ్చన్న చర్చ జరుగుతుంది. దీంతో ఈ పదవి కోసం మాజీ వైస్ ఎంపిపి సిఎల్ నాయుడు తనయుడు చొంగ శివానంద్ గట్టిగా పోటీపడుతున్నట్లు తెలుస్తుంది. మొదటి నుంచి రాజకీయ కుటుంబం కావడంతో పాటు తండ్రి సిఎల్ నాయుడు మండల టిడిపి ఉపాధ్యక్షులుగా తల్లి రమాదేవి మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేసే ఈ ప్రాంతంలో ప్రజలతో ఎనలేని సంబంధాలను పెంచుకున్నారు. శివానంద్ యువకుడు కావడంతో పార్టీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇక్కడ అందరినాయకులతో పరిచయాలు ఉండటం వివాదాలకు దూరంగా ఉండడం ఈయనకు కలిసి వస్తుందని ఇప్పటివరకు భావిస్తున్నారు.

లుంబూరులో గ్రామ సభ

పాలకొండ : మండలంలోని లుంబూరులో మంగళవారం సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర కుమార్ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఉపాధి హామీ చట్టంలో 2026- 27 ఆర్థిక సంవత్సరానికి గానూ ఉపాధి పనులు గుర్తించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని ఉపాధి కూలీలంతా ఇ - కెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టిసి రోజా రమణి, ఉప సర్పంచ్ పి.రామచంద్రరావు, ఫీల్డ్ అసిస్టెంట్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సంతను పరిశీలిస్తున్న జిసిసి అధికారులు

జిసిసి ఆధ్వర్యంలో గిరిజన సంత

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో మొండంఖల్ మంగళవారం వారపు సంతలో జిసిసి ఆధ్వర్యంలో గిరిజన సంత నిర్వహించారు. జన జాతీయ దివాస్ కార్యక్రమంలో భాగంగా గిరిజన ప్రాంతాల్లో వారపు సంతల్లో జిసిసి ఉత్పత్తులు స్టాల్స్ ఏర్పాటు చేసి అమ్మకాలు జరుపుతున్నామని, అలాగే వారపు సంతకు వచ్చిన గిరిజనులకు నాణ్యమైన వస్తువులు- నాసిరకం వస్తువులు మధ్య వ్యత్యాసంపై అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నామని పార్వతీపురం డిఎం జె.రామారావు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలను మోసగిందుకు ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిసిసి ఉత్పత్తులు తక్కువ ధరకు విక్రయిస్తున్నట్టు తెలిపారు. అటవీ ఉత్పత్తులు సేకరణ, జిసిసి కొనుగోలు ధరలు వివరించారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీ పురం బ్రాంచి మేనేజర్ ఎస్.రాము, గోడౌన్ ఇన్‌ఛార్జులు తమ్మయ్య, సంగంనాయుడు, భాస్కరరావు పాల్గొన్నారు.

లీకేజీ సమస్యలు పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో తాగునీటి పంపిణీ విధానంలో లీకేజీ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులను ఇంజినీరింగ్ శాఖ అధికారులు, సిబ్బంది చేపట్టారు. దాసన్నపేట, సూర్య నగర్, డబ్బారి కళ్యాణమండపం, ఫూల్ బాగ్ లోని మంగళ వీధి తదితర ప్రాంతాలలో గుర్తించిన లీకేజ్ మరమ్మతులు చేపట్టారు. ఆయా పనులను ఎఇలు పర్యవేక్షించారు.

లారీ డ్రైవర్ మృతి

బలిజిపేట : స్థానిక జడ్పీహెచ్ స్కూల్ వద్ద పశ్చిమ గోదావరి జిల్లా కొయ్యలగూడెం మండలం టిబి గూడెంకు చెందిన లారీ డ్రైవర్ ద్వారపురెడ్డి భాస్కరరావు మంగళవారం మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే తెలంగాణకు చెందిన లారీ బలిజిపేటకు సిమెంటు లోడ్‌తో వచ్చింది. సోమవారం ఉదయం అన్లోడ్ చేసిన అనంతరం హైస్కూల్ మలుపు వద్ద మంగళవారం లారీ నిలిచిపోవడం చూసిన స్థానికులు ఏం జరిగిందని చూడగా లారీ డ్రైవర్ చనిపోయి కనిపించాడు. వెంటనే స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.